క్లుప్తంగా

గురుకుల ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ

ఉప్పునుంతల: ఎడ్యుకేట్ ఇండియా మూవ్‌మెంట్ (భారత విద్యా ఉద్యమం) ద్వారా పే బ్యాక్ టు ది సొసైటీలో భాగంగా ఆదివారం మైక్రోసాఫ్ట్ టీమ్స్ యాప్ ద్వారా 5వ తరగతి గురుకుల పాఠశాలల్లో ప్రవేశ పరీక్షల కోసం ఆన్‌లైన్ తరగతులు ఉచితంగా అందించే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు ఉపాధ్యాయులు భౌతిక, గాజుల వెంకటేష్ శనివారం ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజు సాయంత్రం 5:30 నుంచి 6:30 వరకు నిర్వహించే ఈ ఆన్‌లైన్ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఆన్‌లైన్ తరగతులు వినియోగించుకునే విద్యార్థులు 9052492491 నంబర్‌ను సంప్రదించాలని వారు కోరారు.

విద్యావలంటీర్లకు వేతనాలు అందజేత

కొల్లాపూర్: నియోజకవర్గ పరిధిలోని ఎత్తం, సింగోటం, ఎల్లూరు, మొలచింతలపల్లిలో ప్రభుత్వ పాఠశాలల్లో క్లాస్‌మేట్ క్లబ్ సభ్యులు ఏర్పాటు చేసిన విద్యావలంటీర్లకు శనివారం వేతనాలు అందజేశారు. క్లబ్ డివిజన్ అధ్యక్షుడు శంకర్‌గౌడ్ వేతనాలు ఇచ్చారు. విద్యార్థులు, యువతకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలను క్లబ్ ఆధ్వర్యంలో కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో మహేష్, సోమిశెట్టి రాంప్రసాద్, చెన్నరాయుడు, రత్నగిరి భీమయ్య తదితరులున్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి



నాగర్‌కర్నూల్ క్రైం: ప్రతి వాహనదారుడు నిబంధనలు పాటించాలని ఎస్‌ఐ మహేందర్ సూచించారు. శనివారం జిల్లా కేంద్రంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి వాహనాలను తనిఖీ చేశారు. ఎస్‌ఐ మాట్లాడుతూ నంబర్ ప్లేట్ లేని వాహనాలతో పాటు, ట్యాంపరింగ్ చేసిన వాహనాలను, పత్రాలు లేని వాటిని సీజ్ చేశామని తెలిపారు. రోడ్డు ప్రమాద నివారణ చర్యల్లో భాగంగా ప్రతిరోజు వాహనాల తనిఖీని చేపడతామని, శనివారం 50 వాహనాలు సీజ్ చేశామని తెలిపారు.

ఆర్థికసాయం అందజేత



కల్వకుర్తి టౌన్: పట్టణంలోని గాంధీనగర్ కాలనీలో విజయ్‌కుమార్ ఆర్థిక స్థోమత బాగా లేకపోటంతో అతని కూతురు ఉన్నత చదువులకు మిత్ర ఫౌండేషన్ సభ్యులు రూ.5వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. శనివారం వారి ఇంటికి వెళ్లి ఆర్థిక సాయం సభ్యులు అందించి, చదువు కోసం మరింత సాయం అందిస్తామని తెలిపారు.

తెలకపల్లి: గౌరారం చెందిన సల్వాది సాయమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. గ్రామానికి చెందిన బిక్కు సాహెబ్ కుటుంబ సభ్యులకు రూ.5వేల శనివారం అందజేశారు. కార్యక్రమంలో రాజారెడ్డి, రవికుమార్, ఆంజనేయులు పాల్గొన్నారు.

నేడు వట్టెం వెంకన్నకు లక్ష తులసీ అర్చన

బిజినేపల్లి: మండలంలోని వట్టెం వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం లక్ష తులసి అర్చన ఉత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు శనివారం పత్రికా ప్రకటనలో తెలిపారు. త్రిదండి చిన్నజీయర్‌స్వామి మంగళా శాసనములతో వేంకటేశ్వరస్వామి, అమ్మవార్లకు ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

శనేశ్వరుడికి పూజలు



బిజినేపల్లి: మండలంలోని నందివడ్డెమాన్‌లోని జ్యేష్ఠాదేవి సమేత శనేశ్వరునికి ఆలయ ప్రధాన అర్చకుడు గవ్వమఠం విశ్వనాథశాస్త్రి భక్తుల చేత తిలతైలాభిషేక పూజలు నిర్వహించారు. శనివారం తెల్లవారుజాము నుంచి శనిదోష నివారణ కోసం వచ్చిన భక్తుల చేత గోత్రనామార్చన, మంత్రోచ్చారణ, అభిషేకాలు, అష్టోత్తరం నిర్వహించారు. భక్తుల పెద్ద సంఖ్యలో పాల్గొన్ని స్థానిక శివున్ని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఉమ్మడి జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు

కోడేరు: మండల కేంద్రంలో ఈనెల 15, 16, 17న సంక్రాంతి పండుగ సందర్భంగా ఉమ్మడి జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్లు రాజేష్, శ్రీకాంత్, కార్తీక్, రాజేష్ తెలిపారు. ఈనెల 14వరకు ఆసక్తి గల వారు 6309782760, 7671882453 నంబర్లకు సంప్రదించాలని వారు కోరారు.



కొల్లాపూర్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఆర్డీఓ, తహసీల్దార్



అచ్చంపేటలో దరఖాస్తును స్వీకరిస్తున్న మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్

ముగిసిన దరఖాస్తుల స్వీకరణ

వెల్దండ: మండలంలోని పోషమ్మగడ్డతండాలో శనివారం నిర్వహించిన ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను డీఆర్‌డీఓ నర్సింగ్‌రావు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు అందిస్తున్న దరఖాస్తులను పరిశీలించి తీసుకోవాలన్నారు. దరఖాస్తులు చేసినట్లు తీసుకున్న రశీదులను భద్రపరుచుకోవాలన్నారు. చెదురుపల్లి 455, రేషన్‌కార్డులకు 16, చెర్కూర్ 467, రేషన్‌కార్డులకు 132, పోషమ్మగడ్డతండా 260, రేషన్‌కార్డులకు 111, ఉబ్బలగట్టుతండా 277, రేషన్‌కార్డులకు 93, నగారగడ్డతండా 200, రేషన్‌కార్డులకు 74, నారాయణపూర్ 216, రేషన్‌కార్డులకు 60 చొప్పున దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంపీఓ సునిత, సర్పంచ్‌లు రేవతి, అంజినాయక్, వరలక్ష్మి, దశరథ్‌నాయక్ తదితరులు ఉన్నారు.

కల్వకుర్తిరూరల్: మండలంలోని జీడిపల్లితండా, వెంకటాపూర్ తండాలలో ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ ఆంజనేయులు ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. జీడిపల్లి తండాలో 204, వెంకటాపూర్‌తండాలో 137 దరఖాస్తులు వచ్చాయి.

అచ్చంపేట రూరల్: పట్టణంలోని ప్రజాపాలన దరఖాస్తు కేంద్రాలను శనివారం మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్, కమిషనర్ శ్రీహరిరాజు పరిశీలించారు.

ఉప్పునుంతల: చివరి రోజు రాయిచెడ్, పూర్యనాయక్‌తండా, లక్ష్మాపూర్‌లో గ్రామసభలు నిర్వహించి అధికారులు దరఖాస్తులను స్వీకరించారు.

పెద్దకొత్తపల్లి: మండలంలోని చంద్రబండతండా, పెరుమాండ్లపల్లి, తిరునాంపల్లిలో ప్రజాపాలనలో ప్రజల దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీపీ సూర్యప్రతాప్ గౌడ్, జెడ్పీటీసీ గౌరమ్మ తదితరులు పాల్గొన్నారు.



వెల్దండ మండలం పోషమ్మగడ్డతండాలో దరఖాస్తులను పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ నర్సింగ్‌రావు



పెద్దకొత్తపల్లి మండలం చంద్రబండతండాలో..

తాడూరు: యత్మతాపూర్, ఎటిధార్‌పల్లి, యంగంపల్లిలో దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. 24 పంచాయతీలకు గాను అభయహస్తంకు 10,701, రేషన్ కార్డుల నిమిత్తం 3,566 దరఖాస్తులు అందినట్లు ఎంపీడీఓ గంగమోహన్ తెలిపారు.

చారకొండ: మండలం 17 గ్రామాల్లో అభయహస్తం 7,762, రేషన్ కార్డులకు 2,233 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ వెంకటేష్ తెలిపారు. మండల కేంద్రం నుంచి అధిక దరఖాస్తులు అందినట్లు పేర్కొన్నారు.

కొల్లాపూర్: పట్టణంలోని అన్ని వార్డుల్లో దరఖాస్తుల స్వీకరణ కొనసాగింది. ఆర్డీఓ నాగరాజు, తహసీల్దార్‌శ్రీకాంత్ పలు వార్డుల్లో పరిశీలించారు.

తెలకపల్లి: జంగమోనిపల్లిలో 113, గ్రీవెన్స్ దరఖాస్తులు 29, బోరబండ తండాలో 144 దరఖాస్తులతో పాటు గ్రీవెన్స్ కింద మరో 30 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ భాస్కర్ తెలిపారు.

లింగాల: మండల వ్యాప్తంగా 5 గ్యారంటీలతో పాటు రేషన్ కార్డుల కోసం ప్రజలు దరఖాస్తులు చేసుకున్నారు. మండలంలోని 23 పంచాయతీల నుంచి 13 వేలకు పైగా దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

పెంట్లవెల్లి: మండలంలో శనివారం వరకు 5,945 దరఖాస్తులను తీసుకున్నట్లు ఎంపీడీఓ రామయ్య తెలిపారు.

ఊర్కొండ: మండలంలోని 16 ఆరు గ్యారంటీలకు 7,690, ఇతర సమస్యలపై 69 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.



లింగాలలో..



యత్మతాపూర్‌లో..



పెంట్లవెల్లిలో..

శ్రీరామ అక్షతల పంపిణీ

తెలకపల్లి: మండల కేంద్రంలో శ్రీరామ అక్షతలను శనివారం ఇంటింటికీ పంపిణీ చేశారు. అక్షతలు ప్రతి ఇంటికి రావడం పుణ్యకార్యమని, రాముల వారి అక్షతలు అందరూ స్వీకరించాలని సర్పంచ్ సురేఖ కోరారు.

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని విద్యానగర్, గాంధీనగర్ కాలనీలలో అక్షతల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం చేపట్టారు. వీహెచ్‌పీ మహిళా విభాగం ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి అక్షతలు, శ్రీరాముడి చిత్రపటాన్ని ఇచ్చారు.

పెంట్లవెల్లి: మండలంలోని మంచాలకట్ట, ఎంగంపల్లితండా, మల్లేశ్వరంలో శనివారం అక్షతలను ఆయా గ్రామాలలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పల్లెశివ, సందీప్, రాఘవేంద్ర, కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.



తెలకపల్లిలో అక్షతలు పంపిణీ చేస్తున్న సభ్యులు

'ధరణి' ఆపరేటర్ల వేతనాలు చెల్లించండి



వినతిపత్రం అందజేస్తున్న ధరణి ఆపరేటర్లు

నాగర్‌కర్నూల్: ధరణి ఆపరేటర్ల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని కోరుతూ శనివారం కలెక్టర్ ఉదయ్‌కుమార్‌కు జిల్లా ధరణి ఆపరేటర్లు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కో–ఆర్డినేటర్ సంపత్ కుమార్ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని మండల తహసీల్దార్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లు, ఇతరత్రా భూ సంబంధిత సమస్యలపై, కలెక్టరేట్‌లో 23 మంది కంప్యూటర్ ఆపరేటర్లు, జిల్లా కోఆర్డినేటర్లుగా నియమించారని తెలిపారు. తమకు 2018 నుంచి 2021 7వ నెల వరకు రూ.9,878 చెల్లించారని, అప్పటి నుంచి ప్రస్తుతం రూ.11,070 చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. కానీ ఏ ఒక్క నెలలో కూడా సక్రమంగా జీతాలు అందలేదన్నారు. తక్కువ వేతనాలు ఉన్నా, ప్రతి నెల జీతం చెల్లించకపోయిన పనిచేశామని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ చొరవ తీసుకొని సమస్యల పరిష్కారం కృషి చేయాలని కోరారు.

మహారాజుల చరిత్ర తెలుసుకోవాలి

చారకొండ: గతంలో మహారాజులుగా ఉన్న మాదిగల చరిత్రను ప్రతి ఒక్క మాదిగ మహారాజు తెలుసుకోవాలని మాదిగ జాగృతి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భీంరావు మహారాజ్ అన్నారు. ఈయన కందుకూరు మండలం లేమూర్‌లో ప్రారంభించిన పాదయాత్ర శనివారం మండల కేంద్రానికి చేరుకుంది. మండల కేంద్రంలో మహారాజుల కాలనీ కమాన్ ప్రారంభించారు. వారికి మద్దతుగా ధర్మ సమాజ్ పార్టీ నాయకులు స్వాగతం పలికారు. అనంతరం మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా కాలనిలో ఏర్పాటు చేసిన సమావేశంలో మట్లాడారు. కార్యక్రమంలో రాధాకృష్ణ, నాయకులు తదితరులు ఉన్నారు.



కమాన్ ప్రారంభిస్తున్న నాయకులు

ఉపాధ్యాయ సంఘాల క్యాలెండర్ల ఆవిష్కరణ



చారకొండలో యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

చారకొండ: ఉపాధ్యాయులకు శాపంగా మారిన సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరణ చేయాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం ప్రభుత్వ పాఠశాల ఆవరణలో యూటీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఎంఈఓ శంకర్‌నాయక్, మహిపాల్‌నాయక్, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు. పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కమలాకర్‌రావు ఆధ్వర్యంలో జెడ్పీహెచ్‌ఎస్ ఆవరణలో క్యాలెండర్‌ను సభ్యులు, ఉపాధ్యాయులు ఆవిష్కరించారు.

ఉప్పునుంతల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి తపస్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శేఖర్, శ్రీనివాసులు, జగదీశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

అమ్రాబాద్: పీఆర్‌టీయూ క్యాలెండర్‌ను జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఆవిష్కరించారు. మోతిలాల్, ఎంఈఓ బాలకిషన్, తుకారం, మల్లికార్జున్, తులసీరాం పాల్గొన్నారు.

ఆదేశాల మేరకు పనిచేయాల్సిందే..

కందనూలు: ప్రభుత్వ ఆదేశాల మేరకు వంట కార్మికులు పనిచేయాల్సిందేనని శ్రీపురం ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణ్ శనివారం ప్రకటనలో తెలిపారు. మండలంలోని శ్రీపురం ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న మధ్యాహ్నం భోజన వంట ఏజెన్సీ కార్మికులు పెరిగిన ధరలతో తమకు గిట్టుబాటు కావడం లేదని వంట పనికి మానేశారు. దీంతో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కొత్త వారిని నియమించారు. సోమవారం నుంచి యథావిధిగా కొత్త వంట కార్మికులతో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఉంటుందని పేర్కొన్నారు.

ఆస్పత్రి సేవలపై విద్యార్థులకు అవగాహన

కొల్లాపూర్: పట్టణంలోని ప్రభుత్వ పీజీ కళాశాలలో ఎంఎస్‌డబ్ల్యూ కోర్సు చదువుతున్న విద్యార్థులు శనివారం ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించారు. ఫీల్డ్ విజిట్‌లో భాగంగా వారు రోగులకు అందే సేవలు, ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాల గురించి తెలుసుకున్నారు. అడ్మినిస్ట్రేషన్ విధానాన్ని ఫార్మాసిస్టు వెంకటేష్ వివరించారు. టీబీ, మలేరియా, టైఫాయిడ్ పరీక్షల విధానాలను తెలియజేశారు. హెచ్ఐవీకి సంబంధించిన అంశాలను ఐసీటీసీ కౌన్సెలర్ సురేందర్‌గౌడ్ వివరించారు. విద్యార్థుల వెంట కళాశాల అధ్యాపకుడు వెంకటేశం ఉన్నారు.

అధ్యక్షుడికి సన్మానం

ఊర్కొండ: తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన మండల తహసీల్దార్ చెన్నకిష్టన్నను తహసీల్దార్ కార్యాలయంలో శనివారం జిల్లా ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

పేద రైతును ఆదుకోండి

పెద్దకొత్తపల్లి: మండలంలోని కల్వకోలు చెందిన పూజారి భీముడు తన వ్యవసాయం పొలం వద్ద విద్యుత్ షాక్‌కు గురై కుడిచేయి కోల్పోయాడు. బ్యాంకులో అప్పు చేసిన భీముడికి కుటుంబాన్ని పోషించేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ప్రభుత్వం రైతును ఆదుకోవాలని సీపీఐ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఏసయ్య కోరారు. భీముడికి భార్య బంగారమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని కోరారు.



విద్యుత్ షాక్‌తో చేయి కోల్పోయిన భీముడు

అదనపు కట్నం వేధింపులపై కేసు నమోదు

ఉప్పునుంతల: మండలంలోని దేవదారికుంట తండాకు చెందిన కాట్రావత్ మౌనిక ఫిర్యాదు మేరకు శనివారం ఆమె భర్త లింగాల మండలం బంజారా కాలనీకి చెందిన మూడావత్ శంకర్, అతని కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గురుస్వామి తెలిపారు. రెండున్నర ఏళ్ల క్రితం తమ పెళ్లి సమయంలో 20 తులాల బంగారం, 50 తులాలు వెండితోపాటు రూ.10 లక్షలు నగదు ఇచ్చినట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. మరో రూ.50 లక్షలు అదనపు కట్నం తేవాలని తనను భర్తతోపాటు అతని కుటుంబ సభ్యులు శారీరకంగా, మానసింగా వేధించడంతోపాటు ఇంటి నుంచి గెంటివేసినట్లు ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

డాటాఎంట్రీ వేగవంతంగా చేయాలి

కల్వకుర్తి టౌన్: ప్రజాపాలనలో భాగంగా మున్సిపాలిటీలోని 22 వార్డుల ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తుల డాటీ ఎంట్రీ వేగవంతంగా చేయాలని మున్సిపల్ కమిషనర్ అశ్రిత్ కుమార్ అన్నారు. శనివారం పట్టణంలోని మోడల్ డిగ్రీ కళాశాలలో ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలించారు. ఇప్పటివరకు వెయ్యికి పైగా ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తయిందని, మిగితా వాటిని ఆపరేటర్లు నిర్వహిస్తున్నారని కమిషనర్ తెలిపారు. వారం రోజుల పాటు నిర్వహించిన ప్రజాపాలనలో 8,890 దరఖాస్తులు రాగా, వాటిలో ఆరు గ్యారంటీలకు 6,734 మంది దరఖాస్తులు చేసుకోగా, 2,156 మంది రేషన్‌కార్డులతో ఇతర వాటికి దరఖాస్తులు చేసుకున్నట్లుగా కమిషనర్ తెలియజేశారు. వీటన్నింటిని మరో రెండు రోజులలో డేటాఎంట్రీ పూర్తిచేస్తామని పేర్కొన్నారు.



దరఖాస్తుల డాటా ఎంట్రీని పరిశీలిస్తున్న కమిషనర్ అశ్రిత్ కుమార్

గుడిసె దగ్ధం: రూ.6 లక్షల ఆస్తి నష్టం



మంటల్లో కాలి బూడిదైన నగదు, వస్త్రాలు, పత్రాలు

తెలకపల్లి: అగ్నిప్రమాదంలో గుడిసె దగ్ధమైన ఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. శనివారం మధ్యాహ్నం మండలంలోని కార్వంగకు చెందిన గోపస్ చిన్న నిరంజన్ పూరి గుడిసె అగ్నిప్రమాదంలో కాలిపోయింది. ఉదయం అందరూ పొలం పనులకు వెళ్లడంతో షాట్ సర్క్యూట్‌తో గుడిసె పైభాగంలో నిప్పంటుకుంది. ఈ ప్రమాదంలో ఇటీవల మిరప పంట, పత్తి అమ్మిన రూ.3లక్షల నగదుతో పాటు 40 తులాల వెండి, ఇతర బంగారు ఆభరణాలు, దుస్తులు, 5 క్వింటాళ్ల బియ్యం, నిత్యావసర వస్తువులు, గ్యాస్ సిలిండర్లు, ఇంట్లోని సామగ్రి కాలి బూడిదయ్యాయి. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకునే వరకే పూర్తిగా కాలిపోయింది. మంటలు ఇతర ఇండ్లకు వ్యాపించకుండా నీళ్లతో నివారించారు. మొత్తం రూ.6 లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని సీపీఎం నాయకులు గోపస్ లక్ష్మణ్, గోరెటి కాశన్న కోరారు.

గ్యాస్ డీలర్‌పై వినియోగదారుల ఆగ్రహం

తెలకపల్లి: మండల కేంద్రంలోని ఓ గ్యాస్ డీలర్ అవసరం లేకున్న గ్యాస్ పైపులను అంటగడుతున్నారని వినియోగదారులకు నిరసన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న జిల్లా పౌర సరఫరాల సహాయ అధికారి స్వామి శనివారం గ్యాస్ డీలర్ కార్యాలయాన్ని సందర్శించి వినియోగదారులతో, డీలర్‌తో మాట్లాడారు. ఈ–కేవైసీ చేసుకునేందుకు వచ్చిన వినియోగదారులకు అవసరం లేకున్నా సిలిండర్‌కు సంబంధించిన గ్యాస్ పైపు రూ.190 అందజేస్తున్నారని వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అడిగిన వారికే గ్యాస్ పైపు ఇవ్వాలని, అడగని వారికి పైపు ఇవ్వకూడదని, నియమాలు పాటించాలని గ్యాస్ డీలర్‌కు సూచించారు.



వినియోగదారులు, గ్యాస్ డీలర్‌తో మాట్లాడుతున్న అధికారి స్వామి

చెంచులకు ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రం



లింగాల రైతువేదికలో ఆధార్ నమోదు చేయించుకుంటున్న చెంచులు

లింగాల: మండల కేంద్రంలోని రైతు వేదికలో చెంచులకు ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రంలో శనివారం రెండవ రోజు కొనసాగింది. మండలంలోని చెంచు పెంటల నుంచి చెంచులు, వారి పిల్లలు తరలివచ్చి ఆధార్ కార్డుల కోసం తమ పేర్లను నమోదు చేసుకున్నారు. అందరు చెంచులు ఆధార్ నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు ఐటీడీఏ, ఆధార్ నమోదు సిబ్బంది తెలిపారు.

ఓటరు జాబితాపై అభ్యంతరాలుంటే తెలపండి

కల్వకుర్తి: ఓటరు జాబితా డ్రాఫ్టు నోటిఫికేషన్‌పై ప్రజలకు ఏవైనా అభ్యంతరాలు ఉంటే గడువుతేదీలోగా తెలియజేయాలని ఆర్డీఓ శ్రీను శనివారం ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలో 262 పోలింగ్ కేంద్రాలలో ఓటరు జాబితాను ఆయా బీఎల్‌ఓలు ప్రదర్శించారని తెలిపారు. పోలింగ్ కేంద్రాలలో ప్రచురించిన జాబితాలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 22వ తేదీ లోగా బీఎల్‌ఓ, ఓటర్ హెల్ప్‌లైన్ ద్వారా సరిచేసుకోవాలని కోరారు. డ్రాఫ్టు ఓటరు జాబితా ప్రకారం 2,42,153 మంది ఓటర్లు ఉండగా వారిలో 1,22,884 మంది పురుషులు, 1,19,262 మంది మహిళలు, ఏడుగురు ఇతరులు ఉన్నారని తెలియజేశారు. గత అసెంబ్లీ ఎన్నికల ఓటరుజాబితా కంటే 391 మంది ఓటర్లు పెరగగా, అందులో 191 మంది పురుషులు, 200 మంది మహిళలు ఉన్నారు.

ఓటు హక్కు నమోదుకు దరఖాస్తు చేసుకోండి.

కొల్లాపూర్: 18ఏళ్లు నిండిన వారు కొత్తగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏఈఆర్ఓ శ్రీకాంత్ తెలిపారు. నియోజకవర్గ ఎన్నికల జాబితా ముసాయిదాను వారు శనివారం విడుదల చేశారు. ఓటరు జాబితాను రెవెన్యూ, పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో 269 పోలింగ్ స్టేషన్ల పరిధిలో మొత్తం 2,35,874 ఓటర్లు ఉన్నారని, వీరిలో పురుషులు 1,19,942 మంది, స్త్రీలు 1,15,928 మంది, ఇతరులు నలుగురు ఉన్నారు. ఈనెల 1వ తేదీ నాటికి 18ఏళ్లు నిండిన వారు కొత్తగా ఓటు హక్కుకోసం ఫాం–6 ద్వారా, ఓటరు లిస్టులో సవరణలకు ఫాం–8 ద్వారా సవరణలు చేసుకోవాలని సూచించారు. ఫిబ్రవరి 6వ తేదీన నియోజకవర్గ ఓటరు తుది జాబితా విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

చెంచుల మూలాలపై పరిశోధనలు చేయాలి

కొల్లాపూర్: నల్లమల అటవీ ప్రాంతాల్లో నివసించే చెంచుల మూలాలపై పరిశోధనలు చేయాల్సిన అవసరం ఉందని సామాజిక వేత్త పసుపుల నర్సింహా అభిప్రాయపడ్డారు. ఉస్మానియా యూనివర్సిటీతో పాటు, సికింద్రాబాద్ పీజీ కళాశాలకు చెందిన విద్యార్థులు క్షేత్రస్థాయి పర్యటన కోసం కొల్లాపూర్ వచ్చారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ పీజీ కళాశాలలో వారు అధ్యాయన అంశాలపై చర్చ నిర్వహించారు. చర్చకు పసుపుల నర్సింహను ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ చెంచుల మూలాలు, తమిళనాడుకు చెందిన ఓ గిరిజన తెగతో వీరికి ఉన్న సంబంధాలను కొన్ని గుర్తించామన్నారు. వాటిపై పూర్తిస్థాయిలో పరిశోధనలు చేపట్టేందుకు విద్యావంతులు ముందుకు రావాలన్నారు. వారి జీవన స్థితిగతులను మెరుగుపర్చేందుకు సోషల్‌వర్కర్లు కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో క్యాంపు ఇన్‌చార్జ్ శంకర్, అధ్యాపకుడు దేవరాజ్ ఉన్నారు.



మాట్లాడుతున్న పసుపుల నర్సింహా